# 3. ప్రేమాయణంలో పాముల వేట

పంజాబ్‌లోని నభా సంస్థానాధిపతి హిజ్ హైనెస్ మహారాజా రిపుదమన్ సింగ్ శృంగార పురుషుడుగా సంస్థానమంతటా సుప్రసిద్ధుడు.

అయితే మహారాజా వారికి వయసులో నున్న యువతులంటే ప్రత్యేకాపేక్ష అనేది మాత్రం వారి అంతరంగికులకు బహు కొద్దిమందికి మాత్రమే తెలిసిన రహస్యం.

మహారాజా వారికి అంతఃపురం నిండా ఉన్న మహారాణులతో, ఇతర స్త్రీలతో కాలం గడువదు. వారు సదా నూతనానుభవాన్వేషులు. తన కంటపడిన అందాన్ని అంతఃపురం చేర్చి అనుభవిస్తేనేగాని వారికి నిద్రపట్టదు.

అయితే అలా అంతపురం చేరిన సుందరాంగులు మహారాజావారి సరదా తీరగానే పాతకోటలోని ఓ పెద్ద భవంతిలోకి విసరి వేయబడతారు అది దాదాపు ఓ బందిఖానా లాంటిది. ఖైదీలకు వలెనే వారికీ ఇంత తిండి పంపించబడేది. వారి జీవితాలలాగే అక్కడే నిర్వేదంలో అంతమయేవి.

అలాంటి మహారాజా రిపుదమన్‌సింగ్ వారి దృష్టి ఓసుదినాన ప్రీతమ్‌కౌర్ అనే ఓ కన్యపై వాలింది.

ప్రీతమ్ కౌర్ సహజ సౌందర్యవతి మాత్రమేగాక ఉన్నత విద్యావంతురాలు. పంజాబ్ యూనివర్సిటీలో బి. ఏ. ప్యాసయిన బహు కొద్ది మంది యువతులలో ఆమె ఒకతె.

వారిది మంచి సంస్కారమున్న కుటుంబం. ప్రీతమ్ తండ్రి సంస్థానంలోని ప్రముఖ ఉద్యోగులలో ఒకడు. నగరంలోని గౌరవనీయ కుటుంబాలలో వారి దొకటి.

ఈ వివరాలన్నీ తెలుసుకున్న మహారాజావారు అంతఃపురంలో విందుకు విచ్చేయ వలసిందిగా ప్రీతమ్‌కౌర్‌కు ఆహ్వానం పంపించేరు.

కాని, మహారాజా వారి రసికతను గురించి విని ఉన్న ప్రీతమ్ ఆ ఆహ్వానాన్ని మర్యాదగానే తిరస్కరించింది.

ఇలా గాదని మహారాజావారు ప్రీతం తండ్రికి కబురంపేరు, ప్రీతమ్‌ను తనకిచ్చి వివాహం చేయమని అడిగించేరు. కాని అతనందుకు మర్యాదగానే నిరాకరించేడు. అతనికి ప్రీతమ్ ఏకైక సంతానం.

కాని మహారాజా వారంతటితో విరమించక రకరకాలుగా వత్తిడులు తేవటంతో, ఇలా గాదని నగరంలోని ఓ గౌరవ కుటుంబంలోని విద్యావంతుడిని చూసి ప్రీతమ్ తలిదండ్రులు వివాహయత్నాలారంభించేరు.

ఇంతలో మహారాజావారి కిది తెలిసి అడ్డుపుల్లలేసి వివాహాన్ని రద్దు చేయించేరు.

అంతటితో ప్రీతమ్ తలిదండ్రులు హడలిపోయేరు. మరోచోట నిశ్చింతగా బ్రదుకుదామని ఓసుదినాన సంస్థానాన్ని వదలి బయలుదేరారు.

కాని, మహారాజావారి మనుషులు సర్వాంతర్యాములు. వారది సకాలంలోనే కనిపెట్టటంతో వీరు సరిహద్దు దాటక మునుపే రాజభటులు చుట్టు ముట్టి, అరెస్టుచేసి తీసుకపోయి కోటలోని ఖైదు కొట్లలో తలా ఓ గదిలో పారవేశారు

అలా కొద్ది రోజులు గడచిపోయిన తర్వాత...

ఓ సంధ్యవేళ రెండు పొడవాటి విషసర్పాలు ప్రీతమ్ గదిలో ప్రవేశించి నిద్రలో నున్న ప్రీతమ్‌ను చుట్టుకోసాగటంతో ప్రీతమ్ లేచి భయకంపితురాలై చావుకేకలు వేసింది.

కాని, ఆమెను కాపాడగలవా రా సమయంలో అక్కడెవరూ లేరు. ప్రక్క గదుల్లోనే ఉన్న ఆమె తలిదండ్రులు నిస్సహాయంగా చూస్తూ, వింటూ ఉండిపోయేరు.

అలాంటి సమయంలో ప్రీతమ్ ఎదుటి గదిలో బందీగానున్న భూటా అనేవాడొకడు ఎలాగో తలుపులు తీసుకుని ప్రీతమ్ గదిలో ప్రవేశించి అవిడ శరీరాన్ని చుట్టుకుంటూన్న పాముల్ని లాగి అవతల పారవేశాడు.

భయంతో మూర్ఛపోయిన ప్రీతమ్‌ను అక్కున చేర్చుకుని బూటు కాళ్ళతో విషసర్పాల్ని నలిపివేశాడు. మూర్ఛ నుండి తేరుకున్న ప్రీతమ్ భూటాకు పాదాభివందనం చేసింది.

ఈ సంఘటనతో జైలులో సంచలనం రేగింది. ఇనస్పెక్టర్ జనరల్ స్వయంగా వచ్చి తనిఖీచేసి, విచారణ జరిపి, భూటానూ, ప్రీతంనూ, తలిదండ్రులనూ విడుదల చేయించేడు.

వాళ్ళున్నూ దేవుడికి ధన్యవాదాలు తెలుపుకుని ఓ క్షణమేనా ఆలస్యం చేయకుండా ఆ సంస్థానాన్ని విడిచి ప్రక్కనున్న సంస్థానం చేరుకుని సుఖంగా జీవించసాగేరు.

ప్రీతమ్ తలిదండ్రులు భూటాను వదలలేదు. ప్రీతమ్ తన ప్రాణదాతకు మనసంతకుముందే అర్పించి వేసింది. కొద్ది రోజుల్లోనే వారిద్దరి వివాహం నిరాడంబరంగా జరిపించివేశారు పెద్దలు.

తదనంతరం భూటా అత్తమామల వద్ద శలవు దీసుకుని ప్రీతం సమేతంగా స్వస్థలానికి పయనమయ్యేడు.

అలా వెళ్ళి వెళ్ళి అతను సరాసరి నభా సంస్థానాధిపతి హిజ్ హైనెస్ మహారాజా రిపుదమన్‌సింగ్ వారి రాజభవనంలో ప్రీతమ్ సమేతంగా ప్రవేశించాడు.

మరి కొద్ది రోజులకుగానీ తెలీలేదు ప్రీతమ్‌కు-మహారాజా రిపుదమన్‌సింగ్ అవతారమే భూటా అనీ, జైలులో జరిగినదంతా ప్లాను ప్రకారం ఆడిన నాటకమనీ, ఆ విష సర్పాలు విషంలేని, కోరలు పీకబడిన బాపతువనీ, వాటి నలావదలింది సాక్షాత్తు ఇనస్పెక్టర్ జనరల్ మహాశయుడేననీ-కనుకనే భూటా అవతారం ఎత్తిన మహారాజావారు తనగది కటకటాల్నీ, ప్రీతమ్ గది కటకటాల్నీ సునాయాసంగా తెరుచుకువచ్చి తన వీరత్వాన్ని ప్రదర్శించగలిగాడనీనూ.

ఈ సంగతి తెలిసిన ప్రీతమ్ తలిదండ్రులు అంతా విధివిలాసమని ఆనందించేరు. ప్రీతం కూడా మహారాజాకు తనపట్లగల ప్రేమాభిమానాలకు ఆనందించి సరిపెట్టుకుంది.

కొద్ది మాసాలపాటు మహారాజావారు ప్రీతమ్‌ను రాజభోగాలలో ముంచి తేల్చారు. జీవితాన్నో అమృతభాండంగా తోపింపజేశారు.

అమృతం త్రాగి, త్రాగి అది పాతబడగానే మహారాజా రిపుదమన్‌సింగ్‌వారు ప్రీతమ్‌ను పాత కోటలోని ఆ పాడుబడిన భవనంలోని వందలాది దురదృష్టవంతుల మధ్యకు నిర్దాక్షిణ్యంగా విసరివేశారు.

విసరివేసి విజయగర్వంతో మీసం మెలేసుకున్నారు.

ఈ సంగతి తెలిసిన ప్రీతమ్ తలిదండ్రులు గుండెలాగి చచ్చేరు.

★